## క్లుప్తంగా

### కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ముక్తేశ్వరం సెంటర్‌లో విద్యుత్ స్తంభాలను మార్పిస్తున్న ఏఈ హరిబాబు

**అయినవిల్లి:** పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం సెంటర్ పరిధిలో పాత స్తంభాలు స్థానే కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఏఈ హరిబాబు తెలిపారు. హైట్‌లోడు వాహనాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ స్తంభాల ఎత్తును కూడా పెంచినట్లు హరిబాబు తెలిపారు. విద్యుత్ స్తంభాలు మార్చడంతో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇచ్చామన్నారు. దీంతో పెద్దగా ఇబ్బందులేమీ తలెత్తలేదన్నారు.

### నేడు కొత్త పింఛన్ల పంపిణీ

**మలికిపురం:** రాజోలు నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేస్తామని ఆయా మండల పరిషత్ కార్యాలయాలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఉదయం 9 గంటలకు మామిడికుదురు ఎంపీపీ కార్యాలయం, 10 గంటలకు రాజోలు మండలం శివకోడు మంగెన గంగయ్య కల్యాణ మండపం, 11 గంటలకు కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, 12 గంటలకు సఖినేటిపల్లి ఎంపీడీఓ కార్యాలయాల వద్ద కొత్త పింఛన్ల పంపిణీలు జరుగుతాయని ఆయా ఎంపీడీఓలు తెలిపారు.

### ప్రభాకర్ నియామకంపై హర్షం

**అంబాజీపేట:** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కామన ప్రభాకర్ నియమితులు కావడంపై మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ప్రభాకర్ నేతృత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ తదితరులు పేర్కొన్నారు.

### గోదారమ్మకు పున్నమి హారతి

**ఆలమూరు:** మండలంలోని జొన్నాడలో అఖండ గౌతమీ గోదావరి తీరంలో గోదావరి మాతకు శుక్రవారం సాయంకాలం అఖండ పున్నమి హారతి జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేతన జనార్ధనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్రనామాలు, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ పఠించారు.

### సుస్థిర అభివృద్ధి సాధించాలి

**ఆలమూరు:** మహిళల్లో ఆరోగ్యపరమైన అభివృద్ధి-లక్ష్యాల దిశగా చర్యలు చేపట్టాలని సర్పంచ్ కట్టా శ్రీనివాసు, నేలపూడి లావణ్య, వనుం చిన్నావతి అన్నారు. ఆలమూరు, జొన్నాడ, పెనికేరు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం సుస్థిర అభివృద్ధి-లక్ష్యాలు అనే అంశంపై నిర్వహించిన సమీక్షలో పెదపళ్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పీవీ రమణారావు పాల్గొని ప్రసంగించారు. మహిళల్లో ప్రస్తుతం ఉన్న 67 శాతం మేర ఉన్న రక్తహీనతను తొమ్మిది శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను తగ్గించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వై.అరుంధతి, టీఎస్‌వీ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు కె.అనంతలక్ష్మి, డి.వెంకటలక్ష్మి, కె.రాణి పాల్గొన్నారు.

### టీడీపీతోనే జనరంజక పాలన

**అయినవిల్లి/ఆలమూరు/మలికిపురం:** మండలంలోని విలస గ్రామంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు అక్కిశెట్టి దుర్గారావు, మండలశాఖ శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాథుర్, మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. అలాగే ఆలమూరు మండలం చొప్పెల్లలో టీడీపీ నేతలు ఇంటింటికీ పర్యటించి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు. మలికిపురంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలన అధ్వానంగా ఉందన్నారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, మంగెన తదితరులు పాల్గొన్నారు.

### క్షుద్రపూజల కలకలం

**సఖినేటిపల్లి:** స్థానిక ఆబోతు గుడి సమీపాన క్షుద్రపూజల కలకలం రేగింది. నాయుడు రమేష్, రాములు ఇంటి సింహద్వారం శుక్రవారం వేకువన తెరిచారు. ఇంటి గడప వద్ద నల్ల కోడిపెట్ట తలకాయ, మూడు నిమ్మకాయలు, ముగ్గు పెట్టి ఉండటం గమనించి హడలెత్తిపోయారు. దీంతో పాటు ఇంటికి వచ్చే మార్గం పొడవునా నిమ్మకాయలు కొప్పెట్టి, వాటిపై కుంకుమ పూజ చేసిన ఆనవాళ్లు కనిపించాయి. దీనిపై పోలీసులను ఆశ్రయించారు.

# సంక్షేమ పాలనే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే చిట్టిబాబు, వరప్రసాదరావు
- పుల్లేటికుర్రు, కరవాకలో గడప గడపకు మన ప్రభుత్వం



పుల్లేటికుర్రులో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కరవాకలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

**అంబాజీపేట:** దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు సంక్షేమం అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రులో గడపగడపకూ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సంక్షేమాన్ని అందించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ప్రతి 50 ఇళ్లకు వలంటీర్లను నియమించడమే కాకుండా, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకు తెచ్చి గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని అందించారన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు, రహదారులు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై ఎమ్మెల్యే చిట్టిబాబు స్పందించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు నీతిపూడి వెంకటరమణ, కొర్లపాటి కోటబాబు, మట్టపర్తి ఏడుకొండలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, వాసంశెట్టి చినబాబు, నందుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న పాలనతోనే సంక్షేమ రాజ్యం: ఎమ్మెల్యే వరప్రసాదరావు**

**మామిడికుదురు:** ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న పాలనతోనే సంక్షేమ రాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గడప గడపకూ కార్యక్రమం శుక్రవారం కరవాకలో జరిగింది. వరప్రసాదరావు ప్రతి గడపకు వెళ్లారు. ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సావకాశంగా విన్నారు. మీకు అండగా నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. మాట తప్పలేదు. మడమ తిప్పలేదు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి రాష్ట్రాన్ని ప్రగతిబాటలో నడిపిస్తున్నారంటూ వరప్రసాదరావు కీర్తించారు. ప్రతి ఒక్కరూ జగన్‌కు అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు సందాడి పార్థీశ్వరవర్మ, మాజీ సర్పంచ్ సిర్రా శ్రీనివాసరావు, నాయకులు సుంకర బాబ్జి, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, ఈద మనోజ్, ఉచ్చుల విష్ణుమూర్తి, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

## ముగిసిన అధ్యయనోత్సవాలు



అంతర్వేదిలో ముగిసిన స్వామివారి అధ్యయన ఉత్సవాలు

**సఖినేటిపల్లి:** అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఐదు రోజుల పాటు ఆలయ అర్చకులు నిర్వహించిన స్వామివారి అధ్యయన ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల రెండో తేదీన ఆలయంలో ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు ఆశీనులు చేసి విశేష పూజలు నిర్వహించిన వీటికి శ్రీకారం చుట్టారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఏటా ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాల్లో ద్రవిడ ప్రబంధం (గ్రంధం)ను స్వామికి చదివి వినిపించే కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహిస్తారు. ఈ క్రమంలో అంతర్వేదిలో స్వామికి ఈ గ్రంధం వినిపించే ప్రక్రియ కింద అధ్యయన ఉత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామిని కొలిచి అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

## పరిహారంపై రైతులతో జేసీ చర్చలు



రైతులతో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

**మామిడికుదురు:** రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో చర్చలు జరిపారు. పాశర్లపూడిలో రైల్వేలైన్ నిర్మాణం కోసం 359వ సర్వే నెంబర్‌లో 1.95 ఎకరాల భూమిని సేకరించారు. దీనికి పరిహారం చెల్లింపుపై రైతులతో జేసీ చర్చించారు. అధికారుల సేకరించిన స్థలంలో నివాస గృహాలు కూడా ఉన్నాయి. తమ వద్ద నుంచి తీసుకుంటున్న భూములకు ఎకరానికి రూ.38 లక్షల వంతున పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. కానీ రూ.16 లక్షలు వంతున మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువకు అనుగుణంగా రూ.38 లక్షలు వంతున పరిహారం ఇవ్వాల్సిందేనని రైతులు తేల్చి చెప్పారు. తమకు ఇచ్చే పరిహారాన్ని చదరపు గజాల్లో ఇవ్వాలని రైతులు తోరం సూర్యభాస్కర్, బొరుసు తిరుమలరావు కోరారు. అక్కడ ఉన్న భూముల విలువలపై సబ్ రిజిస్ట్రార్‌తో కూడా జేసీ మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య, ఆర్ఐ అలీ పాల్గొన్నారు.

## కొత్తకాలనీలో అగ్నిప్రమాదం

**రావులపాలెం:** స్థానిక సోమసుందరరెడ్డి నగర్(కొత్తకాలనీ)లో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాద సంభవించి ఒక తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, కొత్తపేట ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివాసం ఉంటున్న మానుపాటి నాగు భార్య, పిల్లలతో నివాసం ఉంటున్న తాటాకిల్లుకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఏర్పడి పూర్తిగా కాలిపోయింది. సర్వం అగ్నికి ఆహుతైనట్టు బాధితులు వాపోయారు. స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. ఇంతలో సమాచారం అందుకున్న అగ్నిమాపకాధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పారు. ఈ ప్రమాదంలో నాగు పాకతో పాటు సమీపంలో బండారు పుల్లమ్మ రేకుల షెడ్డు పాక్షికంగా మంటల్లో కాలింది. ఈ ప్రమాదంలో రూ.60 వేల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఫైర్ ఆఫీసర్ ప్రభాకరరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

**నాయకుల ఆర్థిక సాయం :** అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులు నాగు, పుల్లమ్మలకు జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. పూర్తిగా నష్టపోయిన నాగుకు రూ.5 వేలు, పాక్షికంగా నష్టపోయిన పుల్లమ్మకు రూ.2 వేలు తక్షణ సాయంగా అందజేశారు. అలాగే అగ్నిప్రమాద బాధితులకు టీడీపీ, జనసేన నాయకులు బాధితులను పరామర్శించి వారికి నగదు, బియ్యం అందజేశారు.

## దుర్గాదేవికి సామూహిక కుంకుమ పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**కొత్తపేట:** స్థానిక బొరుసువారిసావరం విజయ కనకదుర్గాదేవికి శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణకర్త బొరుసు వెంకట ఉదయభాస్కర్, వసుధ దంపతుల ఆధ్వర్యాన ఆలయ కమిటీ చైర్మన్ పుసులేటి శ్రీనివాస్, సత్యవేణి దంపతుల పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ప్రతి నెలా పౌర్ణమి తిథి నాడు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే గత రెండేళ్లుగా కోవిడ్ నిబంధనలు అనుసరించి పూజలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఏడాది ధనుర్మాసం, పుష్యపౌర్ణమి, శుక్రవారం కలసి రావడంతో ఈ నెల పౌర్ణమి విశిష్టతను సతరించుకుంది. దాంతో మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు తెల్లవారుజాము నుంచి దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

## మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



మోరిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

**సఖినేటిపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మోరిలో రూ.10 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మోరిపడమటిపాలెం, అప్పనరామునిలంక శివారు కొత్తలంక, శృంగవరప్పాడు రాజీవ్ కాలనీలలో రూ.12 లక్షలు చొప్పున నిర్మించనున్న ఒక్కో అంగన్‌వాడీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లతో పాటు అర్హులైన కొత్త వారికి కూడా వివిధ పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, సర్పంచ్‌లు వసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఇందుకూరి సుబ్బరాజు, రావి నాగవెంకట లక్ష్మీదేవి, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

## క్రీడాస్థలంలో ఆర్బీకే నిర్మించవద్దు



పొన్నమండలో క్రీడాస్థల వివాదంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

**రాజోలు:** పొన్నమండ ప్రాథమిక పాఠశాలలో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) నిర్మించవద్దని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆర్బీకే నిర్మించేందుకు గుంతలు తీయడంతో విద్యార్థులకు ఆట స్థలం లేకుండా పోతుందని స్థానికులు కోర్టును ఆశ్రయించారు.

దీంతో నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శుక్లా పాఠశాల స్థలాన్ని పరిశీలించి విద్యార్థుల ఆటస్థలానికి ఆటంకంగా ఉన్న ఆర్‌బీకే పనులను నిలిపివేస్తామన్నారు. విద్యార్థులకు అనువుగా ఆటస్థలాన్ని తీర్చిదిద్దుతామన్నారు. పాఠశాలకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ శుక్లాకు ఎంఈఓ ఎం.విజయశ్రీ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. డీఈఓ ఎస్‌వీ రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవాలపై రెండో రివ్యూ మీటింగ్

**సఖినేటిపల్లి:** అంతర్వేదిలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 6 వరకూ నిర్వహించనున్న స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు పురోగతిపై ఈ నెల 11న రివ్యూ మీటింగ్‌ను అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు అంతర్వేదిలో నిర్ధారిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో నిర్వహించిన మొదటి రివ్యూ మీటింగ్ అనంతరం ఉత్సవాల పనుల పురోగతిపై తీసుకున్న చర్యలను ఆయా శాఖల వారీగా తగిన రిపోర్టు సబ్‌మిట్ చేయాలని కూడా ఆయన సూచించారు. కాగా రెండో రివ్యూ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రానున్నట్టు సమాచారం.

### 9 మందిపై బైండోవర్

**పి.గన్నవరం:** సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి పందేలు నిర్వహించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 9 మందిని బైండోవర్ చేసినట్టు ఎస్సై పి.గంగాభవాని తెలిపారు. పి.గన్నవరం డీఎస్ పాలెంలో నలుగురు, వాడ్రేవుపల్లిలో ఒకరు, మానేపల్లిలో ఇద్దరు, నాగుల్లంకలో ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసినట్టు ఆమె వివరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఆత్రేయపురం:** మండలంలో వసంతవాడకి చెందిన చిర్రా ఆశీర్వాదం (60) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం ఆశీర్వాదం మద్యానికి బానిసై ఈనెల 2న మద్యం తాగి స్పృహ కోల్పోయాడు. దీంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**అయినవిల్లి:** మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన గొల్ల చినబాబు 2022 డిసెంబర్ 31న రాత్రి అదే గ్రామంలో ఉన్న అత్తవారి ఇంటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. మార్గం మధ్యలో కుక్కలు అడ్డురావడంతో ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు సోదరుడు బాబ్జి ఫిర్యాదుతో నమోదు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### విద్యార్థులకు పలు ఆటల పోటీలు

**మామిడికుదురు:** కాకినాడ నెహ్రూ యువ కేంద్రం, ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దీప్తి విద్యా సంస్థల ప్రాంగణంలో విలేజ్ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ ప్రోగ్రామ్ జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలకు కోకో, యువకులకు వాలీబాల్, యువతీయువకులకు షాట్‌పుట్ పోటీలు ఏర్పాటు చేశారు. దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువకులకు ఈ తరహా పోటీలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో పీఈటీ అర్జున్, ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### ట్యాబ్‌లను తగిన రీతిలో ఉపయోగించుకోవాలి

**సఖినేటిపల్లి:** ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను విద్యాపరంగా విద్యార్థులు బాగా ఉపయోగించుకోవాలని డీఈవో ఎస్‌వీ రవిసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటికే పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఆయన పాఠశాలల్లో పరిశీలించారు. ఈ క్రమంలో సఖినేటిపల్లిలోని పాఠశాలకు వచ్చిన ఆయనకు ఎంఈవో నల్లి మనోహరం బొకేతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌ల్లోని బైజూస్ కంటెంట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యాపరంగా లేటెస్ట్‌గా వచ్చే విషయాలపై అవగాహన కల్పించుకోవాలని ఉపాధ్యాయులకు, డీఈవో సూచించారు.

### వాహనాల రాకపోకలకు ఆటంకం

**సఖినేటిపల్లి:** మండలంలోని టేకిశెట్టిపాలెం వద్ద గోదావరిపాయ (బాడిరేవు)పై అప్పనరామునిలంకకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ప్రస్తుత ఉన్న కాజ్ వే మీదుగా శుక్రవారం నుంచి కొన్నాళ్ల పాటు వాహనాలు రాకపోకలకు ఆటంకంగా మారనున్నది. ఇక్కడ లో లెవెల్ కాజ్ వే స్థానే కొత్త కాజ్ వే నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ ఆటంకం కలగనుంది. దీంతో చించినాడ వంతెన వద్ద నుంచి రామరాజులంక, అప్పనరామునిలంక మీదుగా అంతర్వేది వచ్చే భక్తులు, ఆయా ప్రాంత వాసులు ఇకపై అప్పనరామునిలంక గ్రామ సరిహద్దులోని సఖినేటిపల్లి వైపు ఉన్న గోదావరిపాయ(బాడిరేవు)పై కాజ్ వే మీదుగా రాకపోకలు సాగించాలని అధికారులు కోరుతున్నారు. కాగా కొత్త వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా కాజ్ వేకు రెండు వైపులా గోదావరి పాయకు అడ్డు కట్టు వేస్తూ బండ్‌లను సర్వేబాదులతో సిద్ధం చేస్తున్నారు. టూ వీలర్స్‌కు ప్రయాణం తప్ప మిగిలిన వాహనాలకు ఈ మార్గంలో వెళ్లే అవకాశం లేదని వారు చెబుతున్నారు. ప్రయాణికులు ఈ పరిస్థితిని గమనించాలని అంటున్నారు.

### గృహోపకరణాల ఆహుతి

**ఆలమూరు:** మండలంలోని సంధిపూడిలో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో తుటిలో పెను ప్రమాదం తప్పగా గృహోపకరణాలు, వంట పాత్రలు ధ్వంసం కాగా విద్యుత్ తీగలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల కథనం ప్రకారం అడపా జానకిరామయ్య (చినబాబు)కు చెందిన ఇంట్లో గురువారం సాయంకాలం భార్య దుర్గాదేవి వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వెలువడి క్షణాల్లో వంట గది నిండా వ్యాపించాయి. దీంతో ఆమె భయంతో కేకలు వేసి బయటకు పరుగులు తీసింది. ఈ సంఘటనను గమనించిన స్థానికులు సత్వరమే స్పందించి పక్కనే ఉన్న ఇసుకను, నీటిని చల్లి మంటలను అదుపు చేసి ప్రయత్నం చేశారు. ఆ వంటింట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ మాత్రం పేలకుండా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం సుమారు రూ.నాలుగు లక్షల వరకూ ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

### వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు

**రాజోలు/మామిడికుదురు:** వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. శుక్రవారం ఆయన ములికిపల్లిలోని వక్ఫ్ బోర్డు భూములను పరిశీలించారు. గ్రామంలో ఉన్న 2.50 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీపై షరీఫ్ ఆయనకు వివరించారు. మహ్మద్ అబ్దుల్ రబ్బాని, కె.హుస్సేన్ పాల్గొన్నారు.

### రాజోలు ఫొటోగ్రాఫర్లకు ప్రశంస

**మలికిపురం:** ముంబయిలో జరుగుతున్న అంతర్జాతీయ ఫొటోగ్రఫీ ప్రదర్శనకు రాజోలు నియోజకవర్గం నుంచి ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన ప్రదర్శనలో మలికిపురానికి చెందిన రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీవీ రావు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు మీనన్, ప్రభాకర్, వీరేంద్ర, కోటి, భాస్కర్ చిన్ని, అబ్బాస్ తదితరులు హాజరై ప్రదర్శనలో తమ ఫొటోలను ప్రదర్శించారు. పలువురు ఫొటోగ్రాఫర్లకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు ఇచ్చారని సీవీ రావు తెలిపారు.

### భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

**మామిడికుదురు:** నేటి సమాజంలో ప్రతి విద్యార్థి భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఆంగ్ల సాహిత్య నిపుణుడు జగతా వెంకటలక్ష్మీనరసింహారావు సూచించారు. స్థానిక దీప్తి డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆంగ్ల భాషా సదస్సులో ఆయన మాట్లాడారు. ఏరంగంలో అయినా, ఏ సంస్థ లో అయినా ఉద్యోగం కావాలన్నా భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను (కమ్యునికేషన్ స్కిల్స్) చాలా ప్రధానమన్నారు. ఈ తరహా ఇబ్బందులను అధిగమించేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్‌కి ఆంగ్ల భాషను జోడించి మెళకువలు నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు ఇంగ్లిషులో మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోకా రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వలంటీర్ల ద్వారా పింఛన్ల డోర్ డెలివరీ

**పి.గన్నవరం:** దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల ద్వారా సీఎం జగన్ లబ్ధిదారులకు పింఛన్లను డోర్ డెలివరీ చేయిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలో కొత్తగా 391 మందికి మంజూరైన రూ.11,02,250 పింఛన్ సొమ్మును చిట్టిబాబు శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ టి.వెంకటాచార్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మండలంలో కొత్త పింఛన్లతో కలిపి మొత్తం 10,250 మందికి ప్రతి నెలా రూ.2,75,73,000లను పింఛన్ సొమ్మును అందిస్తున్నట్టు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక లబ్ధిదారుడు మరణిస్తేనే, ఆ స్థానంలో మరొకరికి మంజూరు చేసేవారని గుర్తుచేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, నగరం ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, కె.ఏసు, కె.చంద్రకళ, బి.నాగమణి, ఎస్.ప్రసన్నకుమార్, వై.కృష్ణవేణి, ఎంపీటీసీలు ఎ.సూరయ్యకాపు పాల్గొన్నారు.

### రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలి

**అంబాజీపేట:** కిశోర బాలికలు, గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీహెచ్ఏఎఫ్ ఆకెళ్ల లక్ష్మి అన్నారు. గంగలకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనత, పోషకాహార లోపాలు తదితర అంశాలపై కిశోర బాలికలకు, గర్భిణులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అంతకుముందు అంగన్‌వాడీ వర్కర్ సీహెచ్ కనకదుర్గ ప్రీస్కూల్ కిట్లను పదర్శించి వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**రక్తహీనత బాధితులకు శిక్షణ**

**రావులపాలెం:** మండలంలోని రావులపాడులో ఐసీడీఎస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎనీమియా బాధితులకు శిక్షణకార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రక్తహీనత తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులకు, కిశోర బాలికలకు, తల్లిదండ్రులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర్ అవగాహన కల్పించారు.

### ఘనంగా ఆండాళ్ అమ్మవారి సేవ

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆండాళ్ అమ్మవారి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి గ్రామోత్సవం జరిగింది. ద్రవిడ పారాయణ, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

### రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

**అంబాజీపేట:** రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గంగలకుర్రు, కె.పెదపూడి, మొసలపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వరి పొలాలను సందర్శించి, ఈ-క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 23 లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదుకు ఏఏఓ, వీహెచ్ఓలకు రైతులు సహకరించాలన్నారు.

### ర్యాలి పెరుగులంక భూముల సర్వే

**ఆత్రేయపురం:** మండలంలోని ర్యాలి ఎస్సీ సొసైటీకి సంబంధించిన భూములను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. గత ఆరేళ్ల నుంచి సుమారు 127 ఎకరాలను ఏక్‌సాల్ లీజ్ పట్టా పొంది భూమిని సాగు చేస్తున్నారు. ఆ భూముల పరిశీలనకు గత నెల 31న ఆర్డీవో ముక్కంటి తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి పెరుగులంక భూములను పరిశీలించిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, ఆర్ఐ భవానీ, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### చురుగ్గా రహదారి పనులు

**అయినవిల్లి:** మండలంలోని సిరిపల్లి-ముక్కామల రహదారి పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఈ పనులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి దగ్గర పడటంతో ప్రభల ఉత్సవానికి, ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ఈ పనులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా పనులు ముగించి మరలా సంక్రాంతి పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

### అనుమతి లేనిదే విగ్రహాలు ఏర్పాటు చేయవద్దు

**అంబాజీపేట:** ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. ముక్కామల పరిధిలోని ఖండవిల్లివారిపేట సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం స్థానికులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని కొందరు, ఎట్టి పరిస్థితుల్లో విగ్రహాన్ని తొలగించేది లేదని ఇంకొందరు భీష్మించారు. సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించి విగ్రహం ఏర్పాటు చేసిన వారితో చర్చించి విగ్రహం తొలగించాలని చెప్పారు. అనుమతులు ఉంటే తప్ప ఎవరూ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదన్నారు. దాంతో అక్కడ విగ్రహాన్ని తొలగించేందుకు స్థానికులు అంగీకరించారు.

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**అంబాజీపేట:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ అన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని మెయిన్ డ్రైనేజీలు, కాలనీల్లో ఉన్న మురుగు గుంతల్లో దోమల నివారణకు శుక్రవారం ఎబేట్ మందు స్ప్రే చేశారు. పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### యువశక్తికి తరలిరండి

**మలికిపురం/రాజోలు:** 12వ తేదీన శ్రీకాకుళంలోని రణస్థలంలో జరిగే యువశక్తి సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలి రావాలని జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు కోరారు. శుక్రవారం మలికిపురంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువగళాన్ని వినిపించేందుకు అధినేత పవన్‌కల్యాణ్ ఈ సభ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.